
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 38.0
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY



నల్లగొండ

3 గురువారం 20 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.50 (122.5225)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.68)	316	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.88 (0.41)	479	1394

చికెన్ ధరలు: లైవ్ :రూ.161 | డ్రెస్ :రూ.234 | స్కిన్‌లెస్ : రూ.266

ఏళ్ల తరబడి చదువులు. నెలల కొద్దీ కోచింగ్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే తిప్పలు తప్పనున్నాయి. ఇక ఐటీఐల స్థానంలో ఏటీసీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడంతో కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశం రానుంది. మొత్తం ఆరు కోర్సులను కొత్తగా ప్రవేశపెడుతుండడంతో ఈ కోర్సులపై ఇప్పటికే అధ్యాపకులకు శిక్షణ సైతం పూర్తయింది. ఈ కోర్సులతో ఏడాదికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4వేల మంది లబ్ధి పొందనున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



తక్షణ ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

- ప్రతి ఏటీసీలో ఆరు కోర్సులు
- ఉమ్మడి జిల్లాలో ఏడు ఐటీఐల స్థానంలో ఏటీసీల ఏర్పాటు
- ఏటీసీగా మార్చేందుకు ఒక్కోదానికి రూ.34 కోట్ల వ్యయం
- ఈ ఏడాది నుంచే కొత్తకోర్సుల నిర్వహణ
- విదేశాల్లోనూ ఉద్యోగావకాశాలకు ఛాన్స్

విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాలు నేరుగా లభించేందుకు అనుగుణంగా ఐటీఐలను ఆధునికీకరించే ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు (ఐటీఐ)గా కొనసాగుతున్న వాటిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా మార్చబోతోంది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో కలిసి ఈ సెంటర్లను ఏర్పాటుచేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. దీర్ఘ, స్వల్ప కాలిక కోర్సులను ఈ కేంద్రాల్లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు ఐటీఐల స్థానంలో ఏటీసీలు ఏర్పాటవుతున్నాయి. ఒక్కో ఏటీసీలో ఆరు రకాల ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పూర్తయ్యాక టీటీఎల్ సహా అరబ్ దేశాలు, దేశీయ ఐటీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీల్లో తక్షణం ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కూడా ఏటీసీలే బాధ్యత తీసుకుంటాయని ప్రభుత్వం పేర్కొంటుండడం ఏటీసీలకు ప్రభుత్వం ఇస్తోన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలిక కోర్సుల ద్వారా ప్రతీ సంవత్సరం 5,860 మంది, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 31,200 మందికి ఈ ఏటీసీల్లో శిక్షణ అందితే, ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలిక కోర్సుల ద్వారా ఏటా 854 మందికి, స్వల్పకాలిక కోర్సుల ద్వారా 3,360 మంది విద్యార్థులకు శిక్షణ అందుతుందని అంచనా వేస్తున్నారు.

రూ.34కోట్ల వ్యయంతో..

ఏటీసీగా మారుస్తున్న ప్రతీ ఐటీఐకి ప్రస్తుతం ప్రవేశపెడుతున్న కోర్సులకనుగుణంగా అవసరమైన ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలతోపాటు, శిక్షణకు అవసరమైన వర్క్‌షాపులు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, ఇతర సామగ్రి, సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,324.21 కోట్లు ఖర్చుచేస్తుండగా, ఇందులో టీటీఎల్ సంస్థ 86.74శాతం భరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం 13.26శాతం భరిస్తోంది. ఒక్కో ఏటీసీకి సగటున రూ.34కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. రాబోయే పదేళ్లవరకు ఈ ప్రాజెక్టు అమల్లో ఉండనుంది. వీటిద్వారా వచ్చే పదేళ్లలో నాలుగు లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ కల్పన నిమిత్తం శిక్షణ అందిస్తామని ఈసంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు ఉపయుక్తమైన శిక్షణ



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలన్నింటినీ ఏటీసీలుగా మార్చడం అభినందనీయం. ఈ కోర్సుల శిక్షణ ద్వారా ఆధునిక ప్రపంచంలో తక్షణం ఉపాధి, ఉద్యోగం పొందేందు కు విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఇక్కడున్న ఏడు ఏటీసీలలో కొత్త కోర్సుల ఏర్పాటుకు కార్యాచరణ మొదలయింది. ఈ విద్యాసంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభమవుతాయి. ఇంటర్‌స్థాయిలోనే విద్యార్థులు తక్షణం ఉద్యోగం, ఉపాధి పొందేందుకు ఈ కోర్సులు దోహదపడతాయి. విదేశాల్లోనూ ఈ కోర్సులద్వారా ఉద్యోగావకాశాలు ఎక్కువగానే లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- గోపాల్‌రెడ్డి,ఉమ్మడి జిల్లా కన్వీనర్

ఈ సంవత్సరం నుంచే కొత్త కోర్సులు

ఉమ్మడి జిల్లాలోని ఏడు ఏటీసీలలో ఈ సంవత్సరం నుంచే కొత్తకోర్సులు ప్రారంభించనున్నట్లు ఆయా ఏటీసీల ప్రిన్సిపాళ్లు పేర్కొంటున్నారు. ఇంకా పూర్తిస్థాయి విధి, విధానాలు రాలేదని, ప్రాథమిక కసరత్తు, ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు జరిగాయని, వర్క్‌షాపులు, క్లాసుల నిర్వహణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కోర్సులకు కేటాయించిన సీట్ల మేరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని, ఐటీఐలలో సీట్ల కేటాయింపుల మాదిరిగానే ఏటీసీల్లోనూ నిబంధనలు పాటిస్తామని తెలిపారు.

జిల్లాలో ఏటీసీలలో అందుబాటులో ఉన్న కోర్సులు	కాల వ్యవధి	సీట్ల సంఖ్య
1. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్	రెండేళ్లు	24
2. ఆర్టిఫిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	10
3. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్)	రెండేళ్లు	24
4. రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	20
5. మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్	రెండేళ్లు	24
6. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్	ఏడాది	20

ఉమ్మడి జిల్లాలో ఏటీసీలుగా మారనున్న ప్రభుత్వ ఐటీఐలివే..

1. ప్రభుత్వ బాలుర పారిశ్రామిక శిక్షణ సంస్థ	నల్లగొండ
2. ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ	నల్లగొండ
3. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	అనుముల
4. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	డిండి
5. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	భువనగిరి
6. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	ఆలేరు
7. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ	హుజూర్‌నగర్

ప్రతీ ఏటీసీలో ఆరు దీర్ఘకాలిక కోర్సులు

ఈ ఏటీసీలలో ఆరు దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇందులో మూడు కోర్సులు ఏడాది కాలవ్యవధి ఉంటే, మరో మూడు కోర్సులు రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తవుతాయి. ప్రతీ ఏటీసీలో ఈ ఆరు కోర్సులను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు కోర్సుల్లో కలిసి 122మంది విద్యార్థులకు ఒక్కో ఏడాది శిక్షణ అందుతుంది. అదేవిధంగా ఒక్కో కోర్సును బోధించేందుకు ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్ల చొప్పున ఉమ్మడి జిల్లాకు 84మంది ఇన్‌స్ట్రక్టర్లను టీటీఎస్ సంస్థ ఇప్పటికే నియమించింది. అదేవిధంగా ఇప్పటికే ప్రభుత్వ ఐటీఐల్లో ఉన్న



ఇతర ఇన్‌స్ట్రక్టర్లను కూడా ఈ కోర్సులను బోధించేందుకు వీలుగా తగు శిక్షణను కూడా టీటీఎల్ సంస్థ ఇప్పటికే అందించినట్లు తెలుస్తోంది. ఈ ఇన్‌స్ట్రక్టర్లతోపాటు ప్రతీ ఏటీసీలో మరో నలుగురు సిబ్బందిని కూడా నియమిస్తున్నట్లు తెలిపారు. ఏటీసీల నిర్వహణ మొత్తం టీటీఎల్ సంస్థనే పర్యవేక్షిస్తుందని, కోర్సులు మొదలయ్యాక ఇంకా మార్పులు, చేర్పులుంటాయని పేర్కొంటున్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ఉండాలి

గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్

నల్లగొండ టౌన్, జూన్ 19 : సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ డేను పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధిని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆరోగ్య విభాగం జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేట్ మిషన్‌ను ప్రారంభించిందన్నారు. దీని ద్వారా 2047 వరకు సికిల్ సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో భాగంగానే జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ రోజుగా గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. సికిల్‌సెల్ వ్యాధిపై బుధవారం నుంచి జూలై 3 వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ వ్యాధి ఎలా సోకుతుంది, వ్యాధి లక్షణాలు, ఈ వ్యాధిని ఎలా నివారించాలనే విషయాలపై ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ అనీమియా అనేది గిరిజనుల్లో ఎక్కువగా ఉందని, ఈ వ్యాధి విస్తరించకుండా నిర్మూలించాలనే ఉద్దేశంతో ఎలిమినేట్‌మిషన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారని, గిరిజనలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ అనీమియా(రక్తహీనత) అనేది వివిధ రూపాల్లో ఉంటుందని ఐరన్ లోపం వల్ల వచ్చే అనీమియా, బీ-12లోపం వల్ల వచ్చే అనీమియా, ఏ ప్లాస్టిక్ అనీమియా, తలసేమియాగా ఉంటుందని, కానీ సికిల్ సెల్ అనీమియా అనేది సైలెంట్ కిల్లర్‌గా ఉంటుందన్నారు. దీనిని గుర్తించి చికిత్స తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, ఆర్‌సీవో సుధాకర్, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి, ఏఎన్‌ఎం లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి అందరూ సహకరించాలి

సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు

కేతేపల్లి,జూన్ 19: ఈనెల 24న నిర్వహించే మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు అందరూ సహకరించాలని సివిల్ సప్లయి జిల్లామేనేజర్, మండల ప్రత్యేక అధికారి జి.నాగేశ్వర్‌రావు కోరారు.వచ్చే సోమవారం నిర్వహించే ప్రజావాణి సన్నాహక సమావేశం బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతీ సోమవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలనుంచి ఆర్జీలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒక్కో ఆర్జీకి విధిగా రశీదు ఇవ్వాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం, ఏపీఎం యాదమ్మ, ఈజీఎస్ ఏపీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలి

డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని జి.నాగేశ్వరరావు సూచించారు. కేతేపల్లిలో ఆయన బుధవారం ఏవోతో కలిసి ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనవెంట ఎంపీడీవో శ్రీనివాసరావు ఉన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం రేపు

నల్లగొండ టౌన్, జూన్ 19: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఈ నెల 21న జిల్లా పరిషత్ ఛైర్మన్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామస్థాయి నుండే ప్రభుత్వ పథకాల అమలు



ఆసుపత్రిలో రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, జూన్ 19 : గ్రామస్థాయి నుండే ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి మండలాల ప్రత్యేకఅధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో ఈ నెల 24 నుంచి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామస్థాయిలో విద్య, వైద్యం, ఆరోగ్యం ఉపాధి హామీ ప్రజాపాలన తదితర అన్నిపథకాలు సరైన విధంగా లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ, మండల స్థాయి అధికారులపై ఉం దన్నారు. అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ పథకం కింద లక్ష్యంతో పాటు, పెండింగ్ లబ్ధిదారు లు, వారి జాబితాను ప్రత్యేకంగా రూపొందించాలన్నారు. మండలస్థాయి టీంలను గ్రామస్థాయి టీంలను పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో ఆయా పథకాల వారీగా సమీక్షించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి బృందాలను ఆశావాద దృక్పథంతో తీర్చిదిద్దాలన్నారు. మునిసిపాలిటీల్లో సైతం ఇదేవిధంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు పూర్తిగా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, ఉద్యోగులు ఎవరైనా అనధికారికంగా విధుల కు గైర్హాజరైతే సస్పెండ్ తప్పదని హెచ్చరించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ప్రజాప్రతినిధులను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజాసంఘాలు, మీడియాను సైతం పరిగణలోకి తీసుకుని ముందుకువెళ్లాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులపై శుక్రవారం నుంచి ప్రతి రోజూ ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్, ఇంజనీర్లతో సమీక్షిస్తానన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు జే శ్రీనివాస్, టీ పూర్ణచంద్ర, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఎలా ఉన్నాయి; రూ.5 భోజనం ఇస్తున్నారా?

కలెక్టర్‌గా విధుల్లో చేరిన మూడవ రోజే సీ నారాయణరెడ్డి కొరఢా ఝుళిపించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని తనిఖీచేశారు. ఎమర్జెన్సీ, ఐసీయూ, పాలియేటివ్ కేర్, మేల్, ఫిమేల్ వార్డులు, సర్జికల్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఎంసీహెచ్ వార్డులను కలియ తిరిగారు. ఆయా వార్డుల్లో రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్యసేవలు ఎలాఉన్నాయి? రూ.5భోజనం ఇస్తున్నారా? లేదా? తాగునీరు ఎలా ఉంది? టాయిలెట్లు బాగున్నాయా? ఎక్కడ పడుకుంటున్నారని వివరంగా అడిగి తెలుసుకున్నారు. మేల్ సర్జికల్ వార్డులో ప్రతీ పనికి డబ్బులు అడుగుతున్నారని రోగుల సహాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ డబ్బులు అడిగిన ఇద్దరు వార్డ్‌బాయ్స్‌లను సస్పెండ్ చేశారు.డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్, శానిటేషన్ సిబ్బందితో పాటు ఇతరుల వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడగడమే కాకుండా హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. .డ్యూటీడాక్టర్లు డ్యూటీ సమయంలో ఆస్పత్రిలోనే అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. అందుబాటులో లేకుంటే వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా, ఒకవేళ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తే తొలగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.అన్నివార్డుల్లో వైద్యులతో పాటు, సిబ్బంది, నర్సులు వారికి కేటాయించిన సమయాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. పనిచేస్తేనే ఆసుపత్రిలో ఉండాలని, లేకుంటే ఉద్యోగం వదిలివెళ్లిపోయినా తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. మొత్తం ఎంత మంది కార్మికులు ఉన్నారు? ఆయా వార్డుల్లో ఎన్నిసార్లు శుభ్రం చేస్తున్నారని ఆరా తీశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ అన్నివార్డులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, లేకుంటే కాంట్రాక్టు రద్దు చేస్తామన్నారు. అనంతరం మాతా, శిశు ఆరోగ్య విభాగాన్ని తనిఖీ చేసి ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, ఆర్‌ఎంవో ప్రశాంత్, డ్యూటీ డాక్టర్లు ఉన్నారు.

జిల్లా న్యాయాధికారి కలిసిన కలెక్టర్

జిల్లా న్యాయాధికారి ఎం.నాగరాజును కలెక్టర్ సీ నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా కలెక్టర్ నారాయణరెడ్డిని ఆయన ఛాంబర్‌లో ఎస్పీ శరత్‌చంద్రపవార్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.



న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కృత్రిమ కొరతను ఉపేక్షించం

మునుగోడు, జూన్ 19 : విత్తనాలు, ఎరువులు కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా ఏమాత్రం ఉపేక్షించమని జడ్పీ సీఈవో, మునుగోడు మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడులోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. నిల్వల వివరాలను విధిగా పట్టికలో నమోదు చేయాలన్నారు. డీలర్లు అనుమతులు ఉన్న విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని,విక్రయించిన ప్రతీ సరుకు రశీదులు అందజేయాలని సూచించారు.



మునుగోడులోని ఓ దుకాణంలో విత్తనాలు, ఎరువుల నిల్వల రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

ప్రజావాణి విజయవంతం చేయాలి

ఈనెల 24 నుంచి ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యాక్రమాన్ని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహణపై ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ప్రజావాణి కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో పూజా, తహసీల్దార్ నరేందర్, వివిధ శాఖల అధికారులు, జీపీ కార్యదర్శులు సిబ్బంది పల్గొన్నారు.

స్వప్రయోజనాల కోసమే మార్పులు

- బీఆర్‌ఎస్, బీజేపీ నేతలను కలిసిన నల్లగొండ బైపాస్ బాధితులు
- మీ అనుచరుల కోసం పొట్టకొట్టొద్దు
- అక్రమాలను వెలుగులోకి తెస్తా: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- ఆప్షన్ మూడుతో మూడు వేల కుటుంబాలకు అన్యాయం
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే బాధితుల కోసం ఆందోళన చేపడతాం: బీజేపీ

6

యువతకు ఉపాధిని మెరుగుపరుస్తాం


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో అధునాతన సాంకేతిక కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్, జూన్ 19: యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరిగట్టు వద్ద రూ.40కోట్లతో నిర్మిస్తున్న అధునాతన సాంకేతిక కేంద్రం (ఏటీసీ) భవన నిర్మాణానికి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ పరిధిలో రాష్ట్రంలో 65 ప్రభుత్వ ఏటీసీ, 225 ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులకు ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ 32 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఆయా పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో 76,900 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏటీసీ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు అప్రెంటీస్ ద్వారా శిక్షణ ఇప్పించి ప్రతీ రెండో సోమవారం వివిధ ప్రభుత్వ ఏటీసీల్లో అప్రెంటీస్ మేళాలను నిర్వహిస్తామన్నారు. మేళాలకు పరిశ్రమల నిర్వాహకులను ఆహ్వానించి విద్యార్థులతో ముఖాముఖి ఇంటర్వ్యూలు చేపడతామన్నారు. శిక్షణ సమయంలో రూ.8వేల నుంచి రూ.11,500 వరకు స్టైఫండ్ ఇస్తామని, ఏటీసీ శిక్షణ తీసుకుంటున్న సమయంలోనే వృత్తి నైపుణ్యం పెరిగేందుకు విద్యార్థులను పరిశ్రమలకు పంపించి మూడు నెలల్లో శిక్షణ పూర్తి చేయిస్తామన్నారు. హుజూర్‌నగర్‌లోని అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)లో 216 సీట్లు ఉన్నాయన్నారు. పట్టణంలోని ఐదు ఎకరాల్లో ఏటీసీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. టాటా కంపెనీ సహకారంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యువతకు అన్యాయం జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే 30వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. త్వరలో మరిన్ని పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, మునిసిపల్ ఛైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, యరగాని నాగన్నగౌడ్, డిప్యూటీ డైరెక్టర్ రాజారావు పాల్గొన్నారు.











యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, జూన్ 19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.25,03,371 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని నటి అనసూయ భరద్వాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు అర్చకులు వేదాశీర్వచనం చేయగా, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.



ప్రధానాలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



కృష్ణ (ఫైల్)

దామరచర్ల, జూన్ 19: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మండలకేంద్రంలో బుధవారం జరిగింది. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి... తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన మద్దూరి కృష్ణ(52) కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి తిరుపతి నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న పూర్ణ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లోకో పైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వేఎస్ఐ తెలిపారు. కేసును రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత దర్యాప్తు చేపట్టారు. కృష్ణకు భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నాపరాయి తరలిస్తున్న లారీ పట్టివేత




పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

ప్రభుత్వ అనుమతులు లేకుండా నాపరాయిని తరలిస్తున్న లారీని నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన సంఘటన ఉల్సాయిపాలెం గ్రామ శివారులోని కాల్వకట్ట వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిట్యాల గ్రామం నుంచి నాపరాయిని లారీలో లోడ్ చేసుకొని ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్లకు అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఉల్సాయిపాలెం గ్రామ శివారులోని కాల్వకట్ట వద్ద లారీని పట్టుకున్నారు. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పరారయ్యారన్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ బత్తుల అమరలింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలోనే గ్రీవెన్స్‌డే

త్రిపురారం: ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోనే గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నల్లగొండ జడ్పీ డిప్యూటీ సీఈవో బీ. శ్రీనివాస్‌రావు తెలిపారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్‌తో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో కోడిరెక్క రాజేందర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.











సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మిర్యాలగూడలో జరిగిన సమావేశంలో 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, జూన్ 19: విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి వెంకటేశ్వర్లు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం జరిగిన డివిజన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా కార్మికుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్ సాధన దిశగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. మార్చి 10న యూనియన్ రాష్ట్ర నాయకత్వం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలను వివరించి పరిష్కారించాలని కోరినట్లు తెలిపారు. 50డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హమీ ఇచ్చారన్నారు. అనంతరం యూనియన్ డివిజన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ. షఫీఖాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్‌కె. అహ్మద్, డివిజన్ కార్యదర్శి గోలి నరేందర్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా మోతీలాల్ నాయక్ ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి. జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి. సాయిబాబా, డిస్కం అధ్యక్షుడు వేణు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. వెంకన్న, రాష్ట్ర సలహాదారు ఎన్. జనార్ధన్‌రెడ్డి, జి. శ్రీనివాస్, వెంకటయ్య, డివిజన్ నాయకులు సి.సాలమన్, కర్ర రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

నల్లగొండ టౌన్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెనుకాడేది లేదని 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యూనియన్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు నిత్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. న్యాయపరమైన ఇబ్బందుల పేరుతో విద్యుత్ రంగంలో ఉద్యోగులు మూడు సంవత్సరాలుగా పదోన్నతులకు నోచుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ సంఘం కృషి ఫలితంగా విడుదల చేయనున్నారని తెలిపారు. ఉద్యోగులకు బదిలీలు ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. సీనియర్ ఫోర్‌మెన్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 52సమస్యలపై ఇప్పటికే యాజమాన్యానికి నోటీసు అందజేసి పీఎన్‌సీ సమావేశం అడిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా రీజినల్ అధ్యక్షుడు నిమ్మచెట్ల వెంకటయ్య, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఏ. వేణు, వర్కింగ్ అధ్యక్షుడు ఎన్. వెంకన్న, యూనియన్ రాష్ట్ర సలహాదారుడు ఆర్.జనార్ధన్‌రెడ్డి, జిల్లా అద్యక్షుడు టి. జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పి. రాంబాబు, డి కోటి, సిహెచ్ యాదగిరి, కె. జగదీష్, శీనయ్య, పీవీ. నాయక్, ముత్తయ్య ఉన్నారు.

'నీట్' పరీక్ష రద్దు చేయాలి



మిర్యాలగూడలో సంతకాలు సేకరిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 19: నీట్ పరీక్షను రద్దు చేసి, వేలాది మంది విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఆరీఫ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యవిద్యలో ప్రవేశాలకు నిర్వహించే ప్రశ్నాపత్రం లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని, సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు చందాల ప్రశాంత్‌కుమార్, సంజీవ్, సతీష్, రాము, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

హాలియా, జూన్, 19: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా హాలియాలోని సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై, అనుమతి లేని పాఠశాలలపై, సీబీఎస్ సిలబస్ పేరుతో తల్లితండ్రులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 19: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కొండేటి సురేష్, రూత్ దంపతుల కూతురు(16) కన్పించడం లేదని బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో పిర్యాదు చేశారు. పుట్టుకతో చెవుడు సమస్యతో బాధపడుతున్న బాలిక అవంతీపురంలోని బధిరుల పాఠశాలలో విద్యనభ్యసిస్తోంది. ఈ నెల 18వ తేదీన పట్టణంలోని రాంనగర్ సరస్వతీ స్కూల్ వెనుక భాగంలో ఉన్న తమ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు సెల్: 7075050756, 8341853108 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మునుగోడు, జూన్ 19: నల్లగొండ జిల్లా మునుగోడు శివారు మీదుగా రెండు గూడ్స్ ఆటోల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన శ్రీశైలం, రూప్‌సింగ్ వేర్వేరుగా ఆటోల్లో వివిధ సంచుల్లో నింపుకొని తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి, జూన్19: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పడమటితండాలోని సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దేవరకొండ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మల్లేషంతో కలిసి ధ్వంసం చేశారు. సారా బట్టీలు నిర్వహించినా, నల్లబెల్లం, పటిక నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మొదటిసారి పట్టుబడితే బైండోవర్, రెండోసారి పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. దాడుల్లో వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, సైదులు, నాగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గదిలోనే శునకం.. తాళం వేసిన కళాశాల సిబ్బంది

దేవరకొండ, జూన్19: తరగతిలోకి వెళ్లిన శునకాన్ని గమనించకుండా సిబ్బంది తాళం వేసి వెళ్లిపోయారు. బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో కిటికీల వద్దకు వచ్చి మొరుగుతూ గంట సేపు యాతన పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో బుధవారం జరిగింది. సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత సిబ్బంది తరగతి గదులకు తాళాలు వేసే క్రమంలో కళాశాల గదిలోకి ఓ శునకం చేరింది. దానిని గమనించని సిబ్బంది కళాశాల గదులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో శునకం కిటికీల వద్దకు వచ్చి మోరిగింది. కళాశాల ఆవరణలో సాయంత్రం వాకింగ్ చేస్తున్న డివిజన్ పంచాయతీ అధికారి రాంమోహన్‌కు శునకం అరుపులు వినిపించాయి. ఆయన వెంటనే అక్కడికి వెళ్లి తాగునీరు, ఆహారం అందించారు. స్థానిక ఎంఈవోకు, కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే వచ్చి కళాశాల గది తెరవడంతో శునకం బయటకు వచ్చి పారిపోయింది.

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు

ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు

నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు

సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు

రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.

తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు

సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు

ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి

శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం

ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు

వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

మూడు నెలల ముందుగానే

వర్చువల్ క్యూ బుకింగ్

● శబరిమల దర్శించే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శుభవార్త

నార్కట్‌పల్లి, జూన్ 19: మండల పూజ, మకర విళక్కు సమయాల్లో శబరిమలను దర్శించే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శుభవార్త చెప్పింది. శబరిమలకు వెళ్లే భక్తులకు కనీస వసతులు, భద్రత కోరుతూ ప్రచారసమితి తరఫున గతేడాది కేరళ సీఎం పినరై విజయన్‌కు తాము చేసిన వినతికి ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు సానుకూలంగా స్పందించిందని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే తెలిపారు. గతంలో స్వామి దర్శనం కోసం ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కేవలం పదిరోజుల ముందునుంచి మాత్రమే ఉండేదని, ఇప్పుడు మూడు నెలల ముందుగానే వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకునే అవకాశాన్ని బోర్డు కల్పించిందని తెలిపారు. అదేవిధంగా భక్తుల ఆరోగ్యభద్రత కోసం ఇన్సూరెన్స్ పాలసీని అందించనున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. భక్తులు దర్శనం టికెట్ బుకింగ్ చేసుకునే సమయంలోనే వారి వద్ద నుంచి అదనంగా రూ.10లు వసూలు చేసి బీమా పాలసీని వర్తింపజేస్తారని దేశ్‌పాండే తెలిపారు. చిన్నారుల కోసం ప్రత్యేక బ్యారికేడ్లు ఏర్పాటుచేసి అయ్యప్ప దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం అప్పం, అరవణ ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ప్రకటనల ఆవరణలో సెన్సార్ కౌంటింగ్ పరికరాన్ని ఏర్పాటు చేసి భక్తుల సంఖ్యను లెక్కించనున్నారని దేశ్‌పాండే తెలిపారు.

ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంఎస్‌రెడ్డి



ఎంఎస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

నాగార్జునసాగర్, జూన్ 19: నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత సిబ్బంది ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ కమాండెంట్ సామోల్ జాన్ బదిలీపై హైదరాబాద్ ఆర్పీఐకి వెళ్లారు. నూతనంగా వచ్చిన ఎంఎస్‌రెడ్డికి సిబ్బంది స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన సామోల్ జాన్‌కు వీడ్కోలు పలికారు. ఎస్పీఎఫ్ ఆర్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, పుల్లయ్య, డీడీ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సరదా అంచున ప్రమాదం



భువనగిరి పెద్ద చెరువు కట్టపై ఇరువైపులా ఆహ్లాదకరమైన చెట్లు, లవ్ భువనగిరి, భారీ ఎత్తున జాతీయ జెండా ఏర్పాటు చేయడంతో సందర్శకుల తాకిడి పెరుగుతోంది. చెరువులోని ఎఫ్‌టీఎల్ మార్కింగ్‌పై ఇరువైపులా రక్షణ గోడ లేదు. అక్కడ సెల్ఫీలు దిగడానికి యువతి, యువకులు ఆసక్తి చూపుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో చెరువులో పడిపోయే ప్రమాదముంది. ● స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రిభువనగిరి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలునాయక్



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన 33మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష 116 రూపాయల కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకొని వారు ఆయా మండలాలలోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేయడం, విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. అనంతరం పట్టణంలోని 20వ వార్డు గాంధీనగర్ కాలనీకి చెందిన మేగావత్ లక్ష్మికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాను అందజేశారు. కార్యక్రమంలో చింతపల్లి ఎంపీపీ భవానీపవన్‌కుమార్, వైస్‌ఎంపీపీ యాదగిరిగౌడ్, హరినాయక్, సంజీవరెడ్డి, ముచ్చర్ల గిరి, ఎరుకల వెంకటయ్యగౌడ్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్ తదితరులుఉ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ఆంజనేయస్వామికి జలాభిషేకం



ఆంజనేయస్వామికి జలాభిషేకం చేస్తున్న రైతులు

శాలిగౌరారం, జూన్ 19: వర్షాల కోసం ఆంజనేయస్వామికి రైతులు జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, అదరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ మండలంలోని వంగమర్తి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన రైతులు జలాభిషేకం చేశారు. గత 25 రోజులుగా వర్షాలు కురవక విత్తనాలు మొలకెత్తడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని రైతులు స్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో రైతులు బెల్లి వీరభద్రం, కొరివి సైదులు, బెల్లి సంపత్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మునుగోడు, జూన్ 19: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వారు కలిశారు. చేనేత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీని చేసిందని అదే తరహాలో మళ్లీ చేయించేందుకు, చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలు, పెండింగ్ బకాయిలు, త్రిఫ్ట్ ఫండ్స్ నిధుల విడుదలకు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మునుగోడు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కర్నాటి లింగయ్య, ఉపాధ్యక్షుడు సంగిశెట్టి పరమేష్, నాయకులు గంజి బిక్షం, అవ్వారి భాస్కర్, జగన్నాథం, వెంకయ్య, యర్రమాద వెంకన్న, నరేందర్, వెంకటేశం, భిక్షపతి, ధనుంజయ, మునుగోడు సహకార సంఘం పరిధిలోని పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి



అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ భవాని

చింతపల్లి, జూన్ 19: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన చింతపల్లి, మర్రిగూడ, నాంపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆట, పాటలతో పాటు బోధన కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చింతపల్లి సీడీపీవో లావణ్యకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కమలబాయి, సుగుణ, జ్ఞానేశ్వరి, అంజమ్మ, యశోద, వసంత, పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పుస్తకాలను అందజేశారు.

రైతుభరోసా రైతుల ఖాతాల్లో జమచేయాలి

చందంపేట, జూన్ 19: రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు రైతుబంధును ప్రవేశపెట్టి వర్షాకాలం ప్రారంభంలోనే నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. రైతుబంధు నిధులతో రైతులు విత్తనాలు, దుక్కులు దున్నడానికి ఉపయోగపడేవన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు రైతుభరోసా నిధులు జమ చేయకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు గోసుల శివ, శ్రీశైలం, తిరుపతయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య సమాజ్‌లో యోగా దినోత్సవం రేపు

నల్లగొండ కల్చరల్, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదీన పట్టణంలోని ఆర్య సమాజ మందిర ప్రాంగణంలో యోగా ప్రదర్శన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్యసమాజ్ అధ్యక్షుడు బోయపల్లి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభిస్తారని తెలిపారు. వివిధ పాఠశాల చెందిన విద్యార్థులతో పలు యోగా విన్యాసాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్య పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బసవేశ్వర భవన్‌లో....

● ధర్మపీఠం ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని సావర్కర్‌నగర్‌లోని బసవేశ్వర భవన్‌లో ఈ నెల 21వ తేదీన ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఆలయంలో లడ్డూ అమ్మకానికి వేలం

నల్లగొండ కల్చరల్, జూన్ 19: చిట్యాల మండలంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో 2024- 2025 సంవత్సరాలనికి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదం విక్రయించడానికి గురువారం వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఏసీ కె. మహేంద్రకుమార్, పరిశీలకురాలు వెంకటలక్ష్మి, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రెండు లక్షల డిపాజిట్ చెల్లించి ఈ నెల 20 తేదీన ఉదయం ఆలయ ఆవరణలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని వారు సూచించారు.

రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి భూమి విరాళం



నాయకులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న శివశంకర్‌రెడ్డి

చిట్యాల, జూన్ 19: చిట్యాల పట్టణంలో రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణం కోసం చిట్యాలకు చెందిన బొబ్బల శివశంకర్‌రెడ్డి, శ్వేత దంపతులు భూమి విరాళంగా ఇచ్చారు. చిట్యాల మునిసిపాలిటీ 11వ వార్డు ఎంఎన్‌రెడ్డి కాలనీలో 202 గజాల భూమిని బుధవారం ఆయన సంఘం పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ పత్రాలను రెడ్డి సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో బొబ్బల పాండురెడ్డి, కోమటిరెడ్డి రాంరెడ్డి, పాటి మాధవరెడ్డి, వరకాంతం శ్రీనివాస్‌రెడ్డి, జగిని భిక్షంరెడ్డి, వరకాంతం నరేందర్‌రెడ్డి, బొర్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాల కోసమే మార్పులు

● నల్లగొండ బైపాస్ రోడ్డుపై బీఆర్‌ఎస్, బీజేపీ విమర్శలు
● ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దు
● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, నల్లగొండ టౌన్, జూన్ 19: నీ రైట్, లెఫ్ట్ అనే ఇద్దరు వ్యక్తుల కోసం మూడు వేల మంది పొట్ట కొట్టవద్దని మంత్రి వెంకట్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. నల్లగొండ బైపాస్ రోడ్డు బాధితులు బుధవారం భూపాల్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమకు అండగా ఉండాలని కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అవుతానంటూ ప్రగల్భాలు పలికే కోమటిరెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రిగా ఉండి మూడు వేల మంది బాధలను పట్టించుకోకుండా వ్యవహరించడం సరికాదని అన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటానని, త్వరలోనే పాదయాత్ర చేసి ప్రతి వ్యక్తిని కదిలించి బైపాస్ అక్రమాలను వెలుగులోకి తెస్తానని అన్నారు. బైపాస్ రోడ్డు ఏర్పాటులో ఆప్షన్-3 పేరుతో సామాన్యుల భూములను లాక్కొని తమ భూములకు డిమాండ్ పెరిగేలా చేసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. తన హయాంలో ఎవరి భూములను కూడా లాక్కోలేదని, ఒకవేళ ఉంటే రుజువు చేయాలని ఆయన సవాల్ విసిరారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



బైపాస్ రోడ్డు బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

రోడ్డున పడుతున్న 3 వేల కుటుంబాలు : బీజేపీ

ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ విషయంలో మంత్రి వెంకట్‌రెడ్డి స్వప్రయోజనాల కోసమే ఆప్షన్ 3ని తీసుకున్నారని, దీంతో సుమారు 3 వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి అతనో కోడిగుడ్డు రెడ్డి అని విమర్శించారు. నాగార్జునసాగర్ నీటి సంపులో 40 కోతులు పడి మృతి చెందిన సంఘటన మరవకముందే నల్లగొండలో ఓ వ్యక్తి నీటి సంపులో పడి వారం రోజులైనా గుర్తించకుండా పట్టణ ప్రజలకు ఆ నీటిని తాగించిన ఘనత మంత్రి కోమటిరెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. సంఘటన జరిగి దాదాపు 15రోజులు గడుస్తున్నా విచారణ ఎందుకు చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. దీనికి పూర్తిగా మునిసిపల్ అధికారులు బాధ్యత వహించాలని అయన డిమాండ్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం ఆయన తన అనుచరుల ప్రయోజనం కోసమే ఆప్షన్ 1, 2 లను వదిలి ఆప్షన్ 3ని తీసుకున్నారని ఆరోపించారు. మంత్రి అయిన తర్వాత జిల్లా కేంద్రంలో కనీసం రెండు రోజులు కూడా బస చేయలేని మంత్రిపై ప్రజలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. ఆప్షన్ 3ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజలకు న్యాయం జరిగేలా బీజేపీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



బైపాస్ మ్యాప్ చూస్తూ బాధితులతో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

దేశ భావిప్రధాని రాహుల్‌గాంధీ



కేక్ కట్ చేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటేష్

మిర్యాలగూడ, జూన్ 19: దేశ భావిప్రధాని రాహుల్‌గాంధీ అని, రాహుల్‌గాంధీ గొప్ప ఆదర్శనేత అని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్, విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకుంఠిత దీక్షతో రాహుల్‌గాంధీ పాదయాత్ర చేసి కాంగ్రెస్ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారని కొనియాడారు. పేదలకు అండగా నిలబడతామని భరోసా కల్పించారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్‌దేనని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, గంధం రామకృష్ణ, జలంధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజహర్, సికిందర్, సలీం, శ్రీను, అబ్దుల్లా, విష్ణు, అనిల్, చక్రి, మధు, శ్రీను, పరమేశ్వరి పాల్గొన్నారు.

దేశ భావిప్రధాని రాహుల్‌గాంధీ : వెంకటేష్

దేశ భావిప్రధాని రాహుల్‌గాంధీ అని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటేష్ అన్నారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్ జన్మదినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి రాహుల్‌గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ మరణానంతరం ఆయన రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇండియా కూటమి 240 సీట్లు సాధించడం హర్షనీయమన్నారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా రెండు విడతల్లో చేపట్టిన జోడో యాత్ర ప్రజలందరినీ కదిలించిందని అన్నారు. భవిష్యత్తులో రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రభాకర్, సంఘిరెడ్డి, ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను వేడుకలను జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల సమక్షంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న కరెంటు తీగలు



దళిత కాలనీలో కిందకు వేలాడుతున్న తీగలను చూపిస్తున్న మాజీ వార్డు సభ్యుడు రాజు

నార్కట్‌పల్లి, జూన్ 19: మండలంలోని అక్కెనపల్లి గ్రామంలోని దళిత కాలనీలో కరెంటు తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం కొద్దిగా ఒక పక్కకు ఒరగడంతో విద్యుత్ తీగలు కూడా కిందకు వేలాడాయి. చేతికందే ఎత్తులోనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళనలు చెందుతున్నారు. విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని మాజీ వార్డు సభ్యుడు రాజు కోరారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

● మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమ



హాలియా మునిసిపల్ సమావేశ మందిరంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అనుపమ

హాలియా, జూన్, 19: హాలియా మునిసిపాలిటీ అభివృద్ధికి అధికారులు, పాలకవర్గ ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి అన్నారు. హాలియాలో బుధవారం నిర్వహించిన మునిసిపాలిటీ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లు వారి వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పిల్లి చంద్రకళఆంజనేయులు, కమిషనర్ ఎండీ మున్వర్‌అలీ, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రసాద్‌నాయక్, నల్లగొండ సుధాకర్, నల్లబోతు వెంకటయ్య, అన్నెపాక శ్రీనివాస్, గౌని సుధారాణి, ఎల్లమ్మ, కోఆప్షన్ సభ్యులు చాపల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు హద్దులు ఏర్పాటు చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మిర్యాలగూడ, జూన్ 19: చెరువులు కబ్జాలకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేసి రక్షించాలని తాళ్లగడ్డ మందడి వేణుగోపాల్‌రెడ్డి, అన్నారం మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు వాకిటి వెంకటేశ్వర్లు కోరారు. ఆర్డీవో శ్రీనివాసరావుకు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు కబ్జా చేసి కొందరు ప్లాట్లుగా విక్రయిస్తుండగా, శిఖం భూములను ఆక్రమించి సాగు భూములుగా మారుస్తున్నారని ఆరోపించారు. ఊరు ప్రజల నీటి సమస్యలను తీర్చే, మత్స్యకార్మికులకు ఉపాధిని కల్పించే చెరువులను రక్షించాలని కోరారు. ఆర్డీవో తక్షణమే స్పందించి క్షేత్ర పరిశీలన చేసి రిపోర్ట్ సమర్పించాలని ఆర్ఐలు సత్యనారాయణ, రామకృష్ణలకు ఆదేశించారు. కబ్జాదారులు ఎంతటి పరపతి కలిగిన వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తు తరాల వారి కోసం చెరువులను రక్షించుకోవాలని సూచించారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి పలువురి శుభాకాంక్షలు



కలెక్టర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయశాఖ ఉద్యోగులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న పోనుగోటి చొక్కారావు

నల్లగొండ టౌన్, జూన్ 19: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి. నారాయణరెడ్డి బుధవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసి సన్మానించిన వారిలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు పోనుగోటి చొక్కారావు, పెండ్యాల దామోదర్‌రావు తదితరులు ఉన్నారు. అదేవిధంగా జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో న్యాయశాఖ ఉద్యోగులు కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాలు, బొకేలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాతంగి వీరబాబు, ఉద్యోగులు సాగర్‌రెడ్డి, లతీఫ్ వంశీ, గిరి, జంగయ్య, సరస్వతి, మతిన్ పాల్గొన్నారు. జగిని టెక్స్‌టైల్స్ అధినేత జగిని వెంకన్న కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి మెమెంటో అందజేశారు.

సంక్షిప్త సమాచారం...

కనగల్: మండల పరిధిలోని కనగల్, తుర్కపల్లి, తిమ్మన్నగూడెం, తొరగల్లు, దర్వేశిపురం, పగిడిమర్రి, పొనుగోడు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో త్రీఫేజ్ కరెంటు సరఫరాను గురువారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాజశేఖరాచారి తెలిపారు. కనగల్ 132 సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

త్రిపురారం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఉదయం 10.30గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

దేవరకొండ: ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ డిమాండ్ చేశారు. విద్యాసంస్థలు ప్రారంభమైనా మంత్రిని నియమించకపోవడంతో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పుస్తకాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

దేవరకొండ: నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో బుక్‌స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. దేవరకొండ డివిజన్‌లోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలని కోరారు.

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు కొమ్ము యాదయ్య ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

కట్టంగూరు: కట్టంగూరులోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న మహిళ డే వాచ్‌మన్ పోస్టుకు అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూకు 38 మంది అభ్యర్థులు హాజరుకాగా హాజరైనట్లు అధికారులు తెలిపారు. అర్హులైన వారి వివరాలు నిబంధనల ప్రకారం డీఈవో కార్యాలయానికి పంపించినట్లు అధికారులు పేర్కొన్నారు.

కొండమల్లేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.ద్వాకర్, ఎంపీడీవో రాంరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: గిరిజనులపై జరుగుతున్న దాడులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌లో వినతిపత్రం అందజేసినట్లు బంజారా మహిళా సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆనంద్ తెలిపారు. మియాపూర్, నదిగడ్డ ప్రాంతంలో ఇటీవల అదృశ్యమైన గిరిజన బాలిక శవమై కనిపించడం దిగ్భ్రాంతిని కలగజేసిందన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపించి, దోషులను కఠినశిక్ష పడేలా చూడాలని, బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: మండంలోని దోనియాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని సూచించారు.



దాతలను సన్మానిస్తున్న చిట్టిపోలు యాదగిరి

నిడమనూరు: చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. మండలంలోని బంకాపురంలో అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు రూ.50 వేలు బహూకరించారు.

మిర్యాలగూడటౌన్: పాత పింఛన్ విధానాన్ని అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీ రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ తెలిపారు. సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపంలా మారగా, విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణ ప్రజలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తి మార్పిడి పనులకు దళారులను ఆశ్రయించవద్దని మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ కోరారు. మునిసిపల్ పరిధిలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీరోజూ ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని, ఈ మేరకు ఇద్దరు ఉద్యోగులను నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ అనుమతులకై టీఎస్ పాస్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రైవేటు పాఠశాలల ఫీజుల వివరాలను తెలపాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినట్లు సామాజిక కార్యకర్త సరికొండ రుషికేశ్వరరాజు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వివరాలను తెలిపేందుకు ఎంఈవో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

మిర్యాలగూడ టౌన్: విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభిరామ్, ఏబీవీపీ నగర కార్యదర్శి బొల్లేపల్లి మధుమోహన్ వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో కోరారు. విద్యాశాఖను నిర్లక్ష్యం చేయడం తగదని, మంత్రితో పాటు ఆ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమాలలో బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేములపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరు నుంచి పదవ తరగతి వరకు గంటల ప్రాతిపదికన హిందీ సబ్జెక్ట్ బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయాజ్‌ఖాన్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులకు చివరి గడువు ఉన్నందున అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్ జీరాక్స్ కాపీలతో పాఠశాలలో సంప్రదించాలన్నారు.

వేములపల్లి: నులి పురుగుల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సుచరిత అన్నారు. పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. నులి పురుగుల నివారణ మాత్రలను వేసుకోవడం వల్ల రక్తహీనత తగ్గి పోషణ మెరుగుపడుతుందన్నారు.

మునుగోడు: మునుగోడు నియోజవకర్గ కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాల భవనం నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎంపీటీసీ బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో సర్వే నెంబర్ 10, 984, 985లో 5.20ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికైనా ఆ స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం కో సం కృషి చేయాలని కోరారు.

మునుగోడు: మునుగోడులో ఈ నెల 30వ తేదీన నిర్వహించే మాదిగల జనసభకు రాజకీయాలకతీతంగా మాదిగలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్ పిలుపునిచ్చారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన మాదిగల జనసభ ప్రారంభమైనట్లు తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని మేడారం గ్రామానికి చెందిన గ్యార కృష్ణ కుటుంబానికి మేడారం యువత వాట్సప్ గ్రూప్ రూ.80 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.